ఆదివారం
04-08-2024
# ముందడుగు
దినపత్రిక
సంపుటి: 1, సంచిక: 414 పేజీలు: 4 | ₹6
EPAPER.MUNDADUGU.COM
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD


మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



## వరదలకు ఊరంతా కొట్టుకుపోయింది..

మిగతా 2లో



## కోర్టులో అల్లుడిని కాల్చి చంపిన మామ

మిగతా 3లో



## గూగుల్ మ్యాప్‌తో మీరు సహాయపడవచ్చు..

మిగతా 4లో



## మరిచిపోలేని బంధం.. స్నేహం..

మిగతా 5లో

# అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా మోడీ

గ్లోబల్ డెసిషన్ ఇంటెలిజెన్స్ ర్యాంకింగ్ విడుదల ■ 69% ఓట్లతో భారత ప్రధాని మొదటి స్థానం



ముందడుగు జాతీయం:

అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి అగ్రస్థానంలో నిలిచారు. అమెరికాకు చెందిన మార్నింగ్ కన్సల్ట్ అనే సంస్థ సర్వేను నిర్వహించగా.. గ్లోబల్ డెసిషన్ ఇంటెలిజెన్స్ సంస్థ ర్యాంకింగ్‌లను విడుదల చేసింది. సర్వేలో 69 శాతం ఓట్లతో భారత ప్రధాని మొదటి స్థానంలో నిలవగా.. మెక్సికో అధ్యక్షుడు లోపెజ్ ఒబ్రేడర్ 63 శాతంతో రెండో స్థానంలో ఉన్నారు. 25 మందితో రూపొందిన ఈ జాబితాలో జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా చిట్టచివరి స్థానంలో నిలిచారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు 39 శాతం జనామోదం లభించింది. గతంలో వెలువడిన సర్వేల్లోనూ ప్రధాని మోదీ ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలవడం గమనార్హం. ఈ ఏడాది జులై 8-14 మధ్య ప్రతి దేశంలోనూ ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించి సర్వే సంస్థ ఈ జాబితాను విడుదల చేసింది.

### టాప్ దేశాధినేతలు..

భారత ప్రధాని- నరేంద్ర మోదీ (69 శాతం)
మెక్సికో అధ్యక్షుడు- లోపెజ్ ఒబ్రేడర్ (63)
అర్జెంటీనా అధ్యక్షుడు- జేవియర్ మిలి (60)
స్విట్జర్‌లాండ్ అధ్యక్షుడు- వియోల్ అమ్హెర్డ్ (52)
ఐర్లాండ్ ప్రధాని- సైమన్ హారిస్ (47)
యూకే ప్రధాని- కీర్ స్టార్మర్ (45)
పోలాండ్ ప్రధాని- డొనాల్ట్ టస్క్ (45)
ఆస్ట్రేలియా ప్రధాని- ఆంథోని అల్బనీస్ (42)
స్పెయిన్ ప్రధాని- పెడ్రో శాంచెజ్ (40)
ఇటలీ ప్రధాని - జార్జియా మెలోని (40)
అమెరికా అధ్యక్షుడు- జోబైడెన్ (39)
కెనడా ప్రధాని- జస్టిన్ ట్రూడో (29)

# ఇకపై బ్యాంకు ఖాతాకు నలుగురు నామినీలు

## బ్యాంకింగ్ చట్టాల్లో కేంద్రం కీలక మార్పులు




ముందడుగు జాతీయం:

ఒక్కో డిపాజిట్ ఖాతాకు ఇకపై నలుగురు నామినీలను పెట్టుకునేందుకు అనుమతించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. నామినీల సంఖ్యను పెంచడంతో పాటు బ్యాంకింగ్ చట్టాల్లో అనేక మార్పులను ఆమోదించింది. ఈ చర్యతో క్లెయిమ్ చేయని డిపాజిట్ల సంఖ్య తగ్గే అవకాశం ఉందని కేంద్రం భావిస్తోంది. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల సమస్యకు చెక్ పెట్టేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం బ్యాంకులు సేవింగ్, ఫిక్స్‌డ్ డిపాజిట్ల కోసం ఒక నామినీనే

మిగతా 2లో



## చేజారిన మనుబాకర్

# మూడో పతకం

## 25 మీటర్ల పిస్టల్ విభాగంలో నాలుగో స్థానం

ముందడుగు జాతీయం:

పారిస్ ఒలింపిక్స్‌లో భారత యువ షూటర్ మను బాకర్‌కు మూడో పతకాన్ని చేజారింది. 25 మీటర్ల పిస్టల్ విభాగంలో కొద్దిలో పతకంపై గురి తప్పింది. నాలుగో స్థానంతో సరిపెట్టుకున్న ఆమె ఈ ఒలింపిక్స్‌ను రెండు పతకాలతో ముగించింది. మను బాకర్ తొలుత 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో మూడో స్థానంలో నిలిచి కాంస్యం నెగ్గింది. ఆ తర్వాత మరో షూటర్ సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి 10 మీటర్ల

మిగతా 2లో

ముందడుగు
ఆదివారం, 04-08-2024, హైదరాబాద్

# ఇకపై బ్యాంకు ఖాతాకు నలుగురు నామినీలు

(మొదటిపేజీ తరువాయి)

జత చేసేందుకు అనుమతి ఉంది. కేంద్రం తీసుకురాబోయే మార్పులతో ఈ సంఖ్య నాలుగు వరకు పెరగనుంది. ప్రస్తుతం కేంద్రం నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్స్‌కు ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా చేర్చేందుకు వెసులుబాటు ఉంది. కొత్త మార్పులు అమల్లోకి వస్తే యజమాని మరణించిన తర్వాత జాయింట్ ఖాతాదారులకు, వారసులకు డబ్బులు అందించడం సులభంగా మారనుంది. దీనికి సంబంధించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో త్వరలో బిల్లు ప్రవేశపెట్టనున్నారు. దేశంలో 2024 మార్చి నాటికి క్లెయిమ్ చేయని డిపాజిట్ల మొత్తం రూ.78,000 కోట్లకు చేరినట్లు తెలిపారు.

ఈ క్రమంలోనే నామినీల సంఖ్యను పెంచాలని కేంద్రం ,చూస్తోంది. దీంతోపాటు క్లెయిమ్ చేయని డివిడెండ్‌లు, బాండ్లను సైతం ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ ప్రొటెక్షన్ ఫండ్కి చేరేలా బ్యాంకింగ్ చట్టాన్ని సవరించాలని కేంద్రం భావిస్తోంది.

## చేజారిన మనుబాకర్ మూడో పతకం

(మొదటిపేజీ తరువాయి)

పిస్టల్ మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకం సాధించింది. దీంతో ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత మహిళా క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. మూడో పతకం చేజారిన అనంతరం మాట్లాడిన మను బాకర్ తన తల్లికి భావోద్వేగపూరిత సందేశాన్ని పంపింది. "నా కోసం అన్నింటిని త్యాగం చేసిన అమ్మకు ధన్యవాదాలు. నీ సహకారంతో ఎన్నో చీకట్లను చీల్చుకుంటూ బయటకు రాగలిగాను. అమ్మా.. నిన్ను చాలా ప్రేమిస్తున్నాను. నువ్వు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతూ దీర్ఘాయుష్షు కలిగి ఉండాలని కోరుకుంటున్నాను. వీలైనన్ని సంవత్సరాలు నాతో ఉండాలి" అని మను బాకర్ పేర్కొంది.

త్రుటిలో పతకం చేజారినందుకు ఎంతో నిరాశ చెందానని మను బాకర్ అన్నారు. "ఈ ఫైనల్‌లో నాలుగో స్థానంలో నిలిచినందుకు నిరాశగా ఉంది. నా అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి ప్రయత్నించాను. కానీ, అది సరిపోలేదు. మొత్తం మీద ఈ ఒలింపిక్స్‌లో మంచి పెర్ఫామెన్స్ ఇచ్చా.

వచ్చే ఒలింపిక్స్ కోసం ఎదురుచూస్తున్నా. రెండు పతకాలు సాధించినందుకు ఆనందంగా ఉంది. నిజాయితీగా చెప్పాలంటే సోషల్ మీడియాకు దూరంగా ఉన్నాను. నా ఫోన్‌ని చెక్ చేయడం లేదు. కాబట్టి బయట ఏం జరుగుతుందో తెలియదు. కానీ, నా వంతుగా మంచి ప్రదర్శన చేయడానికి ప్రయత్నిస్తున్నానని తెలుసు. ఈ ఒలింపిక్స్‌లో నేను పతకాలు సాధించడం వెనక కోచ్‌లు, ఇతర సిబ్బంది కృషి ఎంతో ఉంది. వారు చాలా కష్టపడ్డారు. టీమ్ మొత్తం మద్దతుగా నిలిచారు" అని పేర్కొన్నారు.

## వరదలకు ఊరంతా కొట్టుకుపోయింది..

- ఆ ఊరిలో ఒక్క ఇల్లు మాత్రమే మిగిలింది
- హిమాచల్ ప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో క్లౌడ్ బరస్ట్



ముందడుగు హిమాచల్‌ప్రదేశ్: హిమాచల్ ప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో క్లౌడ్ బరస్ట్ కారణంగా బుధవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. దాంతో ఇండ్లు, పాఠశాలలతో పాటు ఆసుపత్రులు సైతం దెబ్బతిన్నాయి. ఈ వరద విలయానికి భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. దాదాపు 50 మందికిపైగా గల్లంతయ్యారు. పది మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ వరదలకు సమేజ్ గ్రామం పూర్తిగా కొట్టుకుపోయింది. ఒక్క ఇల్లు మాత్రమే మిగిలింది. గ్రామం కొట్టుకుపోయిన తీరును అనితా దేవి అనే మహిళ కళ్లకు కట్టినట్లు వివరించారు. 'బుధవారం రాత్రి మేం నిద్రిస్తున్నాం. ఆ సమయంలో భారీగా శబ్దం వినిపించింది. మా ఇల్లు ఒక్కసారిగా కుదుపులకు లోనైంది. దీంతో మేం నిద్రలోంచి లేచి బయటకు వెళ్లి చూసేసరికి ఊరు మొత్తం కొట్టుకుపోయింది. భయంతో మేమంతా వెంటనే గ్రామంలోని భగవతి కాళీ మాత ఆలయం వద్దకు చేరుకున్నాం. రాత్రంతా అక్కడే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపాం. ఈ విధ్వంసంలో మా ఇల్లు మాత్రమే మిగిలింది. మిగతావన్నీ కళ్ల ముందే కొట్టుకుపోయాయి' అంటూ భావోద్వేగంతో వివరించింది.

మరో బాధితుడు బక్షి రామ్ మాట్లాడుతూ.. 'నా కుటుంబ సభ్యులు దాదాపు 14 నుంచి 15 మంది వరదలో కొట్టుకుపోయారు. తెల్లవారుజామున 2 గంటలకు నాకు వరద వార్త అందింది. ఆ సమయంలో నేను ఊర్లో లేను. రాంపూర్‌లో ఉన్నాను కాబట్టి ప్రాణాలతో బయటపడ్డాను. తెల్లవారుజామున 4 గంటలకు ఇక్కడకు వచ్చాను. అప్పటి నుంచి గల్లంతైన నా కుటుంబ సభ్యుల కోసం వెతుకుతున్నాను. ఒక్కరైనా సజీవంగా ఉంటారని ఆశిస్తున్నాను' అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. డిస్ట్రిక్ట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రకారం.. కులు, మండి, సిమ్లా ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్ కారణంగా వరదలు సంభవించాయి. ఈ వరదలకు సుమారు 53 మంది గల్లంతయ్యారు. ఇక ఇప్పటి వరకూ ఆరు మృతదేహాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వరదల కారణంగా 60కి పైగా ఇళ్లు కొట్టుకుపోయాయి. పలు గ్రామాలు తీవ్రంగా నష్టపోయాయని డీడీఎంఏ ప్రత్యేక కార్యదర్శి డీసీ రాణా తెలిపారు.



## నా వల్ల కావట్లేదు.. చాలా విసిగిపోయాను

### ఢిల్లీలో సివిల్ సర్వీసెస్ యువతి ఆత్మహత్య

ముందడుగు ఢిల్లీ: ఢిల్లీలోని ఓల్డ్ రాజేందర్ నగర్‌లో సివిల్ సర్వీసెస్ అభ్యర్థిని తాజాగా ఆత్మహత్య చేసుకుంది. మహారాష్ట్రకు చెందిన అంజలి అనే విద్యార్థిని గత కొన్ని రోజులుగా ఢిల్లీలోని ఓల్డ్ రాజేందర్ నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ.. సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో తీవ్ర ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు బలవన్మరణానికి ముందు ఓ నోట్‌కూడా రాసి పెట్టింది. 'మమ్మీ, పాపా.. నన్ను క్షమించండి. నిజంగా నేను చాలా విసిగిపోయాను. ఇక్కడ కేవలం సమస్యలు మాత్రమే ఉన్నాయి. డిప్రెషన్ నుంచి బయటపడేందుకు సాధ్యమైనంత వరకూ ప్రయత్నించాను. కానీ, నా వల్ల కాలేదు' అని సూసైడ్ నోట్ రాసి పెట్టి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనపై అంజలి స్నేహితురాలు శ్వేత మాట్లాడుతూ.. 'అంజలి యూపీఎస్సీ ఎగ్జామ్‌ను మూడు సార్లు ప్రయత్నించారు. కానీ పరీక్షల్లో ఫలితం రాలేదు. దీంతో తీవ్రమైన ఒత్తిడికి లోనైంది. దానికి తోడు కొన్ని నెలలుగా పీజీల్లో అద్దె కూడా పెరుగుతుండటంతో ఆర్థిక పరిస్థితులు తనని చుట్టుముట్టాయి' అని తెలిపింది. మరోవైపు ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషాద సంఘటనకు దారితీసిన పరిస్థితులపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

### వయనాడ్ బాధితులకు మోహన్‌లాల్

# రూ.3 కోట్ల విరాళం

### అవసరమైతే మరిన్ని ఇస్తానని ప్రకటన



ముందడుగు జాతీయం:
కేరళ వయనాడ్ బాధితుల కోసం ప్రముఖ నటుడు మోహన్‌లాల్ రూ.3 కోట్ల విరాళం అందజేశారు. విశ్వశాంతి ఫౌండేషన్ ద్వారా ఆయన ఈ విరాళం ప్రకటించారు. 'ప్రస్తుతం తాము విశ్వశాంతి ఫౌండేషన్ ద్వారా రూ.3 కోట్లు విరాళంగా ప్రకటించాం. బాధితుల పునరావాసం కోసం ఈ నిధులు అందజేశాం. అసరాన్ని బట్టి మరిన్ని నిధులను కూడా అందజేసేందుకు తాము సిద్ధంగా ఉన్నాం' అని మోహన్‌లాల్ చెప్పారు. కొండచరియలు విరిగిపడి 300కు పైగా జనం మరణించిన వయనాడ్ జిల్లాలోని చూరల్‌మాల, ముండక్కై గ్రామాలను ఇవాళ మోహన్‌లాల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విరాళం విషయాన్ని ప్రకటించారు. కాగా, తన తల్లిదండ్రులు విశ్వనాథన్, శాంతకుమారిల పేరిట మోహన్‌లాల్ 2015లో విశ్వశాంతి ఫౌండేషన్‌ను స్థాపించారు. అప్పటి నుంచి ఆ ఫౌండేషన్ సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.


శనివారం మలయాళ నటుడు మోహన్‌లాల్ వయనాడ్‌లో పర్యటించారు. టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా ఉన్న ఆయనకు సైన్యం స్వాగతం పలికింది. అనంతరం అక్కడ అధికారులతో మోహన్‌లాల్ భేటీ అయ్యారు.

# కోర్టులో అల్లుడిని కాల్చి చంపిన మామ

### చండీగఢ్ జిల్లా కోర్టు ఆవరణలో ఘటన

ముందడుగు చండీగఢ్:
చండీగఢ్ జిల్లా కోర్టు ఆవరణలో నీటి పారుదలశాఖ అధికారి హర్‌ప్రీత్‌ని ఆయన మామ కాల్చి చంపారు. నిందితుడిని పంజాబ్ పోలీస్ రిటైర్డ్ ఏఐజీ మల్విందర్ సింగ్ సిద్ధూగా గుర్తించారు. వివాదం కేసులో రెండు పార్టీలు కోర్టుకు వచ్చిన సందర్భంలో కాల్పులు జరిగాయి. నిందితుడి న్యాయవాదులు, అక్కడే ఉన్న పలువురు వెంటనే నిందితుడిని పట్టుకొని ఓ గదిలో బంధించారు. హర్‌ప్రీత్‌ని వెంటనే ఆసుపత్రికి కారులో పీజీఐకి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు నిందితుడి నుంచి తుపాకీ స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్టు చేశారు. ఈ ఘటన శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో జరిగిందని పోలీసులు తెలిపారు. హర్‌ప్రీత్ అతని భార్య డాక్టర్ అమితోజ్ కౌర్ మధ్య వివాదం నడుస్తున్నది.

ఈ 2023 నుంచి ఇద్దరి మధ్య విడాకుల కేసు కొనసాగుతుండగా.. ఈ క్రమంలో ఫ్యామిలీ కోర్టుకు హాజరయ్యారు.






తాజాగా నాలుగోసారి ఫ్యామిలీ కోర్టుకు హాజరయ్యారు. హర్‌ప్రీత్ సింగ్‌పై కాల్పులు జరిపిన సమయంలో అతని తల్లిదండ్రులు సైతం అక్కడే ఉన్నారని పోలీసులు తెలిపారు. నాలుగు రౌండ్ల పాటు కాల్పులు జరిగాయని.. ఇందులో రెండు తూటాలు హర్‌ప్రీత్ సింగ్ కడుపు, తొడ భాగంలో తగిలినట్లు తెలిపారు. నిందితుడి మల్లింగ్ సింగర్‌పై సెక్టార్ 36 పోలీస్‌స్టేషన్లో బీఎన్ఎస్ సెక్షన్ 103(1) ఆయుధాల చట్టంలోని 25, 27, 54,59 సెక్షన్‌ల కింద కేసు నమోదైంది. కోర్టు కాంప్లెక్స్‌లో కాల్పులు చోటు చేసుకోవడం భద్రతపై ఆందోళన వ్యక్తమవుతున్నది.
నిందితుడు భవనంలోకి వచ్చిన సమయంలో భద్రతా సిబ్బంది అతన్ని తనిఖీ చేయడంలో విఫలమయ్యారని, భద్రతా ప్రోటోకాల్‌లో లోపాలు వెలుగు చూశాయి. సంఘటన జరిగిన చోట సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేయలేదనే తెలుస్తున్నది.

# ఎస్‌బీఐ పేరుతో ఫేక్ సందేశాలు.

### కేంద్రం కీలక హెచ్చరికలు జారీ

ముందడుగు జాతీయం:
ఎస్‌బీఐ ఖాతా రివార్డ్ పాయింట్స్ ఉన్నాయని.. వాటిని క్లైమ్ చేసుకునేందుకు ఎస్‌బీఐ రివార్డ్ పాయింట్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ ఓ ఫేక్ మెస్సేజ్ వాట్సాప్‌లతో పాటు మెస్సేజ్‌లు చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్రమంలో రివార్డ్ పాయింట్ల పేరుతో వచ్చే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు చేసింది. నకిలీ సందేశాలను చూసి స్పందించొద్దని సూచించింది. వ్యక్తిగత వివరాలతో పాటు బ్యాంకు వివరాలను సైతం ఎవరితో వెల్లడించొద్దని చెప్పింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ అధికారిక ఎక్స్ (ట్విట్టర్) అకౌంట్ ద్వారా ఈ హెచ్చరికలు చేసింది. రివార్డ్ పాయింట్ల రిడీమ్ చేసుకునేందుకు




లింక్‌ని ఓపెన్ చేయాలని చెబుతుందని.. ఎట్టి పరిస్థితుల్లోనూ లింక్‌ను ఓపెన్ చేయొద్దని.. అలాగే మరెవరికీ షేర్ చేయొద్దని సూచించింది. అలా చేస్తే మోసగాళ్ల బారినపడే ప్రమాదం ఉంటుందని తెలిపింది. ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్‌ల ద్వారా ఎస్‌బీఐ లోగోను వాడుతూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నట్లుగా పేర్కొంది.


# 217 మృతదేహాలు, 143 శరీర భాగాలకు పోస్టుమార్టం

- మృతులు 344, గల్లంతైన వారి సంఖ్య 206
- కేరళ వాయనాడ్‌లో కొనసాగుతున్న రెస్క్యూ టీం

ముందడుగు కేరళ:
కేరళలోని వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య 344కు చేరుకోగా, మరో 206 మంది గల్లంతయ్యారు. శనివారం ఐదో రోజు కూడా రెస్క్యూ టీం ఆపరేషన్ కొనసాగుతోంది. రక్షణ దళాలు, NDRF, SDRF, పోలీసు, అగ్నిమాపక సేవ, వాలంటీర్‌లకు చెందిన 1,500 మంది సిబ్బందితో కూడిన రెస్క్యూ టీమ్ శనివారం ఉదయం చురలమల, వెల్లరిమల, ముండకైల్, పంచిరిమడోమ్‌లోని నాలుగు ప్రాంతాలలో సోదాలు ప్రారంభించింది.

ఇప్పటి వరకు 152 మృతదేహాలను గుర్తించగా, 74 మందిని గుర్తించాల్సి ఉంది. మృతుల్లో 30 మంది చిన్నారులు కూడా ఉన్నారు. శిథిలాల నుంచి పెద్ద సంఖ్యలో ఛిద్రమైన శరీర భాగాలను కూడా స్వాధీనం చేసుకున్నారు.

ఇక్కడ సుమారు 100 సహాయక శిబిరాలు ఉన్నాయి. వీటిలో సుమారు 9,500 మందిని తరలించారు. జిల్లాలోని వివిధ ఆసుపత్రుల్లో 84 మంది చికిత్స పొందుతున్నారు. 217 మృతదేహాలు, 143 శరీర భాగాలకు పోస్టుమార్టం నిర్వహించామని, 119 మృతదేహాలను బంధువులకు అప్పగించామని చెప్పారు. ఓ ప్రకటన ప్రకారం, 518 మంది ఆసుపత్రులలో చేరారు. వారిలో 89 మంది చికిత్స పొందుతున్నారు. కాగా, జూలై 30న



ప్రారంభమైన సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ చివరి దశకు చేరుకుందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. ఇంకా 206 మంది గల్లంతయ్యారని తెలిపారు.

ముందడుగు
ఆదివారం, 04-08-2024, హైదరాబాద్

## మ్యూజిక్ ఆఫ్ హోప్‌ను విడుదల



ముందడుగు హైదరాబాద్:
ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవం 2024 ను పురస్కరించుకుని ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభించిన వినూత్నమైన #TogetherInIVF ప్రచారాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణా రాష్ట్రాలలో నిర్వహించిన ఈ ప్రచారం ద్వారా ప్రజలలో అవగాహన మెరుగుపరచడం మరియు ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవిఎఫ్ ) పట్ల అంగీకారాన్ని పెంచడం లక్ష్యంగా చేసుకుంది. అదే సమయంలో వంధ్యత్వానికి సంబంధించిన అపోహలను పోగొట్టడం మరియు తమ సంతానోత్పత్తి చికిత్స గురించి తగిన సమాచారం తో నిర్ణయాలు తీసుకునేలా జంటలను ప్రోత్సహించటం చేసింది.

"మా ఐవిఎఫ్ శిశువులలో ఒకరి పునఃకలయిక సాక్షిగా, కుటుంబాలపై మా పనితనం చూపే ప్రభావాన్ని గుర్తుచేసింది. #TogetherInIVF ప్రచారం కేవలం అవగాహన పెంచడం కంటే ఎక్కువ; ఇది జంటలు మద్దతు మరియు ఆశాజనకంగా భావించే సంఘాన్ని నిర్మించడం. మేము సాధించిన పురోగతికి మేము గర్విస్తున్నాము మరియు ఐవిఎఫ్ ని అందుబాటులోకి తీసుకురావటం తో పాటుగా అర్థం చేసుకోవాలనే మా మిషన్‌ను కొనసాగించడానికి ఎదురు చూస్తున్నాము" అని ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ , సీఈఓ శ్రీ వినేష్ గాధియా అన్నారు.

# గూగుల్ మ్యాప్‌తో మీరు సహాయపడవచ్చు..

- సంఘటనను బట్టి హెచ్చరికలు జారీ చేయవచ్చు
- గూగుల్ ఫీచర్ ఏలా వాడాలో తెలుసుకుందాం..

ముందడుగు జాతీయం:
ఏదైనా తెలియని కొత్త ప్రదేశాలకు వెళ్లాలంటే చాలా మంది గూగూల్ మ్యాప్స్‌ను వాడుతారు. గూగుల్ మ్యాప్ సాయంతో ప్రయాణం చేస్తారు. రద్దీగా ఉన్న మార్గాలను హైలెట్ చేస్తూ, ఫ్లై ఓవర్‌ల గురించి డిస్‌ప్లే చేయడం వంటి ఫీచర్లను మ్యాప్స్ అందిస్తుంది. అయితే ఒక్కోసారి అనుకోకుండా జరిగే ప్రమాదాల కారణంగా రోడ్డు రద్దీ, హెచ్చరికలు వంటి సమస్యలు తెలుసుకోవాలంటే కష్టం. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు గూగుల్ మ్యాప్స్ కొత్త సదుపాయం తీసుకొచ్చింది. దీని సాయంతో వినియోగదారులే హెచ్చరికలు జారీ చేస్తూ ఇతరులకు సాయం చేయొచ్చు.



ప్రమాదాలు, ఏదైనా కారణంగా రోడ్డుపై ప్రయాణాన్ని మళ్లించడం, పెద్ద ఎత్తున జనం గుమిగూడటంతో వాహనాలు నిలిచిపోవడం వంటి ఘటనలు తరచూ జరుగుతుంటాయి. వీటి గురించి యూజర్లే స్వయంగా అప్‌డేట్ అందించేలా ఈ ఫీచర్‌ని తీసుకొచ్చింది. అంటే ఇకపై రోడ్డు ప్రయాణ సమయంలో ఎదురయ్యే ఎటువంటి సమస్యల గురించి అయినా.. అదే మార్గంలో ప్రయాణించాలనుకొనే ఇతర యూజర్లను అప్రమత్తం చేయొచ్చు. దీంతో అటువైపుగా ప్రయాణించాలనుకొనే వారు వేరే మార్గాల్ని ఎంచుకునే సౌలభ్యం కలుగుతుంది. సమయం ఆదా అవుతుంది.


### ఈ ఫీచర్ ఎలా ఉపయోగించాలంటే..

గూగుల్ మ్యాప్స్‌లో మీరు చేరాల్సిన గమ్యస్థానాన్ని ఎంటర్ చేయాలి.
నావిగేషన్ ప్రారంభించాక, కింద కనిపించే బార్‌ను స్వైప్ చేయాలి.
అందులో 'Add a report' అని కనిపించే ఆప్షన్ ఎంచుకోవాలి.
అందులో క్రాష్, రోడ్ వర్క్స్, లేన్ క్లోజర్.. అంటూ అనేక ఆప్షన్లు కనిపిస్తాయి. వాటిలో మీకు ఎదురైన సమస్యను ఎంచుకొని రిపోర్ట్ చేయాలి.
మీ రిపోర్ట్‌ని కన్ఫార్మ్ చేయగానే అటువైపుగా వచ్చే ఇతర యూజర్లను మ్యాప్స్ అప్రమత్తం చేస్తుంది.

### ఏఐ ఫీచర్లు..

గూగుల్ మ్యాప్స్ తన యూజర్ల కోసం తాజాగా ఏఐ సదుపాయంతో సరికొత్త ఫీచర్లను తీసుకొచ్చింది. దీని సాయంతో రహదారుల వెడల్పును అంచనా వేయొచ్చు. దీంతో నాలుగు చక్రాల వాహన దారులకు రోడ్లు మార్గం ఎంచుకోవడం సులభం కానుంది. ప్రస్తుతం ఈ ఫీచర్ రోలవుట్ అవుతోంది.







# తమిళంలో బంపరాఫర్..
## కార్తీ సరసన మాళవిక మోహనన్

మలయాళం, తమిళ భాషల్లో ప్రతిభావంతురాలైన కథానాయికగా పేరు తెచ్చుకుంది మాళవిక మోహనన్. ప్రస్తుతం ఈ భామ తెలుగులో ప్రభాస్ సరసన 'రాజాసాబ్' చిత్రంలో నటిస్తున్నది. తాజాగా ఆమె తమిళంలో కార్తీ సరసన కథానాయికగా నటించే బంపరాఫర్‌ను దక్కించుకుంది. వివరాల్లోకి వెళితే.. కార్తీ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సర్దార్-2' ఇటీవలే ప్రారంభమైంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ చెన్నైలో జరుగుతున్నది. ఈ సినిమాలో మాళవిక మోహనన్ కథానాయికగా ఖరారైంది. ఈ విషయాన్ని శుక్రవారం మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని, కథాగమనంలో మాళవిక మోహనన్ పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్‌శంకర్ రాజా, నిర్మాత: ఎస్.లక్ష్మణ్ కుమార్.

ముందడుగు
ఆదివారం,
04-08-2024,
హైదరాబాద్






# మరిచిపోలేని బంధం.. స్నేహం..

## మనిషి ఉల్లాసానికి, ఉత్సాహానికి బీజం ▪ హద్దులు, సరిహద్దుల్లేని ఓ ప్రపంచం..

## స్నేహితులు దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

"మనసు బాగా లేదా.. అసలు మనిషివే బాగాలేవా ఎన్ని మందులు వాడినా నీ మనసు మనసులో లేదా ఐతే నువ్వు పెట్టిపెరిగినా, నీ గ్రామానికి వెళ్లు.. నువ్వు చిన్నప్పడు నుంచి ఆడిపాడినా నీ స్నేహితులతో మనసువిప్పి మాట్లాడు.. నీ స్నేహితులతో చిన్నప్పడు నుంచి చేసినా అల్లరి, చిలిపి పనులను నెమరవేసుకుంటూ, ఆ జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకుంటూ ఒక్కరోజు గడుపు.. నీ మనసు మళ్లీ ఉత్సాహంతో ఉరకలెత్తటానికి అదే సరియైన మందు... స్నేహానికి మించిన మందు రక్తసంబంధంలో కూడా కనబడదు.. చివరి శ్వాస ఉన్నంతవరకు మనిషి మరిచిపోలేని అనుబంధమే స్నేహానుబంధం..

### ప్రాణం ఇచ్చే బాల్యం స్నేహం

బాల్యం స్నేహం అంటే అదొక మరపురాని అనుబంధం.. ఎందుకంటే ఒక మనిషికి సమాజం పరిచయం అయ్యేది పాఠశాలలోనే.. తరగతి గదుల్లో పరిచయమైన స్నేహం, జీవితం చివరి వరకు కొనసాగుతూనే ఉంటుంది.. ఉన్నత చదువులని, ఉద్యోగాలని ఎవరు ఎక్కడికి వెళ్లినా కూడా మనిషిని నిత్యం గుర్తుండిపోయేది చిన్నప్పటి నుంచి కలిసిమెలిసి పెరిగినా స్నేహితులే.. అందుకే మా స్నేహం మరిచిపోలేనిది..

ముందడుగు ప్రత్యేకం:
స్నేహం ఆ పదం వింటేనే మనసులో ఏదో తెలియని ఆనందం కలుగుతోంది... మనిషికి తెలియని ఉత్తేజం, ఉల్లాసం అంతా స్నేహంతోనే సాధ్యం.. బంధం, అనుబంధాల కన్నా, రక్త సంబంధాలకన్నా ఒక మనిషి తన కష్టం, సుఖాలను చెప్పకునే ఏకైక మనిషి ఒక స్నేహితుడు మాత్రమే.. స్నేహం విలువలేనిది. లక్షల, కోట్ల రూపాయలు కూడా స్నేహం ముందు దిగదుడుపే.. అందుకే "ఒక కవి అన్నాడు మనిషి మనసు ఉల్లాసంగా, ఉత్సాహంగా మారాలంటే ఒక్కసారి నువ్వు చదువుకున్న నీ పుట్టి పెరిగిన గ్రామానికి వెళ్లి నీ చిన్ననాటి స్నేహితులతో కాసేపు మాట్లాడు అంతకంటే మించిన ఆనందకరమైనది నీ జీవితంలో ఏదీ లేదన్నాడు". అందుకే స్నేహితులతో కాసేపు సరదాగా సంభాషిస్తే బాధలు, కష్టాలు, కన్నీళ్లు అన్నీమటుమాయమే.. స్నేహితుడితో కలిసుండే ఆ సమయం, మళ్లీ మళ్లీ రావాలని కోరుకుంటాం. వయస్సు మీద పడుతున్న, శరీరం ముడతలు పడుతున్న, మనసుకు స్వాంతన కలిగించేదీ



ఒక్క స్నేహమే. అందుకే స్నేహం ఎప్పడు వర్ణించలేని ఒక మధురకావ్యం.

### ఎవరెంత ఎదిగినా మనసులో మార్పు రాదు

అఆలు నుంచి మరణం చివరి వరకు ఎన్ని కష్టాలొచ్చినా, ఎన్ని గొడవలొచ్చినా, ఎంతమంది ఎన్ని రకాలుగా విడదీయాలని చూసినా స్నేహం మీద నమ్మకం, స్నేహితుడంటే ప్రాణంతో బతికే వారు ఇప్పటికి ఎంతోమంది ఉన్నారు. పెళ్లిళ్లు చేసుకొని కొంతమంది, ఉద్యోగ ప్రయాణంలో మరికొంతమంది పిల్లలు దూరమైనా తన మనసుకు ఆనందాన్ని కలిగించే తన స్నేహితుడు ఉంటే చాలనుకొని జీవనం సాగిస్తున్నారు. మనిషి శరీరానికి మరణం ఉండొచ్చు కాని, స్నేహనికి మాత్రం మరణం లేదు. ఒక స్నేహితుడు ధనవంతుడై, ఉన్నత స్థానంలో ఎదిగినా, మరో స్నేహితుడు స్వంత గ్రామంలో కూలీ పని చేసుకున్న వారి స్నేహంలో మాత్రం మార్పు కనిపించదు. చిన్నప్పడు ఒకే తరగతి గదిలో చదువుతూ, అడుగులో అడుగేస్తే, అల్లరి చిల్లరి పనులు చేస్తూ సాగిన ఆ జ్ఞాపకాలు గుర్తువచ్చినప్పడల్లా కన్నీటి నుంచి తెలియకుండా చుక్కలు రాలిపోతూనే ఉంటాయి.

### ఉద్యమంలో మొదలైన స్నేహం

మనం చేసే పనిలో, మన ప్రస్థానంలో ఎన్నో పరిచయాలు ఉంటాయి.. కాని అందులో కొన్ని పరిచయాలు మాత్రమే మరిచిపోలేనివి.. కొన్ని పరిచయాలను చూస్తుంటే మాత్రం ఏదో తెలియని అనుబంధం ఉన్నట్టు అనిపిస్తోంది.. మేము చేసే ఉద్యమ ప్రస్థానంలో మొదలైన స్నేహం జీవితం చివరి వరకు కొనసాగుతూనే ఉంటుంది.. అందులో కొంతమంది వ్యక్తులతో బంధం జీవితం చివరి వరకు మరిచిపోలేనిది..



